


సంతపేట పక్కనించెళితే వచ్చే గవ్వళ్ళ వీధిలో ఉంది గోపీచందనం రంగేసిన సుబ్బారావుగారి పాతమేడ.

మెట్లెక్కి హాల్లో కొచ్చి చూస్తే గోడల నిండా పక్క పక్కనే జేర్చి కనిపిస్తాయి రకరకాల ఫొటోలు. ప్రతి ఫొటోలోనూ స్కూలు మేష్టరు లాగ రకరకాల ఫోజులిచ్చి నిలబడి కనిపిస్తాడు సుబ్బారావు. పిల్లలకి పాఠాలు చెప్తున్నట్టూ... తప్పు చేసిన పిల్లల్ని పేక బెత్తం పట్టుకుని మందలించినట్టూ పిల్లలు ఆడుకుంటే నిలబడి నవ్వుతా చూస్తున్నట్టు పై అధికారి తణికీకి వస్తే అతనికి బదులు చెప్తున్నట్టూ స్కూలు పిల్లల్ని పిక్‌నిక్‌కి తీసుకెళ్తున్నట్టు ఇలా రకరకాల పోజుల్లో నిలబడి ఉంటాడు సుబ్బారావు. అసలుపేరు కటుకం సుబ్బారావు అయితే ఊరిజనం అంతా ''మేట్టారు సుబ్బారావు'' అని పిలుస్తారు. కానీ,

సుబ్బారావు మేష్టారు కాదు.


ఓల్డ్ ఎస్.ఎస్.ఎల్.సి పాసైన సుబ్బారావు చెల్లూరు సుగరు ఫేక్టరీలో పనిచేస్తున్నాడు. తండ్రిచ్చిన ఇరవయ్యేకరాల మాగాణీ కొంత రొక్కం ఉంది.

పుట్టినప్పట్నించి మేష్టారవ్వాలి... మేష్టారవ్వాలి అని కలగంటానే మేష్టారు కాలేకపోయిన సుబ్బారావుకి ఆ కోరిక కోరికగానే మిగిలిపోయింది. దాంతో, ఎలాగైనా మేట్టారవ్వాలని వాళ్ళ వీధిలో దూళ్ళకాడ పనిచేసే కుర్రాళ్ళు వెంకట్రావుగాడి కొడుకు శీనుగాడు, తాడిచెట్ల కల్లు తీసే అప్పారావు కొడుకూ, కంసాలి నాగేశ్వ్రావు కొడుకు భద్ద్రావుగాడ్నీ... అలా పది పదిహేను మంది కుర్రగాళ్ళని పోగేసుకుని పాఠాలు చెప్పడం మొదలెట్టాడు సుబ్బారావు.

పిల్లకాల్వల దగ్గరా, చెరువుల దగ్గరా ఆడుకునే ఈ కుర్రాళ్ళకి సుబ్బారావు పాఠాలు అర్థం గావటం లేదు సరికదా... ఎప్పుడు పారిపోయి చెరువులో ఈత కొడదామా అనుకుని పరుగు లంకించుకున్నారు.


వారంరోజులు పాటు చూసిన సుబ్బారావుకి పిల్లలు రాకపోయేసరికి పెడల్ ఊడిపోయిన డొక్కు ర్యాలి సైకిలేసుకుని వెతకడం మొదలెట్టాడు. చెరువుగట్ల దగ్గరా, పుంతరేవు దగ్గరా... వూళ్ళో రకరకాల చోట్ల వెతుకుతున్న సుబ్బారావుని చూసిన కుర్రగాళ్ళు గేలాపెత్తడం మొదలెట్టారు.

ఒకరోజంతా ఆలోచించిన సుబ్బారావు రామచంద్రపురం వెళ్ళి వాళ్లకోసం పలక, బలపం, పుస్తకాలు కొనుక్కొచ్చి రాత్రుళ్ళు వాళ్ల



ఇంటికెళ్ళి అమ్మానాన్నల్ని బతిమాలుకుని మళ్ళీ పాఠాలు చెప్పడం మొదలెట్టాడు. రెండు మూడు రోజుల తర్వాత మళ్ళీ పారిపోడం మొదలెట్టారాళ్ళు.

అక్కడ్నించి వాళ్ళకి చిరుతిళ్ళు, డబ్బులు అలవాటు చేసి కొన్నాళ్ళు పాటు పాఠాలు చెప్పాడు. సుబ్బారావు ఇస్తున్న డబ్బులుకి ఆశపడి కొన్నాళ్ళయితే వచ్చారుగానీ, తర్వాత తప్పించుకు పారిపోడం మొదలెట్టారు కుర్రాళ్ళు.



బాగా రాత్రయ్యింది వీధి చివర పిచ్చికుక్కని నాలుగు ఊరకుక్కలు తరుముతున్నాయి. దూరంగా ఎక్కడ్నుంచో వెంకన్నబాబు సేవ చేస్తున్న పాటలు వినిపిస్తున్నాయి. కటకం సుబ్బారావుగారి పాతమేడలోకి ఆగాగి వస్తుంది తూరుపు గాలి. పందిరిమంచం మీద పడుకున్న సుబ్బారావుకి నిద్రరాక అటూ ఇటూ పొర్లుతున్నాడు.

''మంచినీళ్ళు గావాలంటే మరచెంబు కిందుంది'' అంది ఆళ్ళావిడ పాపక్క.

ఏం మాటాడలేదు సుబ్బారావు.

ఇంకాస్సేపయ్యేక ''నిద్రోక ఎందుకలా కదులుతున్నారు?'' అంది పాపక్క.

''చదూకోండ్రా చదువు చెప్తాను... అంటే వినడం లేదు వూళ్ళో పిల్లలు'' అన్నాడు సుబ్బారావు.

''ఆళ్ళు మన సొంతపిల్లలా ఏవన్నానా? అయినా... ఆళ్ళ అమ్మా బాబులికి లేని దురద మీకెందుకంట'' అంది.

''అలా అనకు పాపా చదువెంత గొప్పదో తెల్సా నీకు? చదువుకుంటే ఎన్ని ఉపయోగాలో తెల్సాంట''.

''ఇప్పుడు మొదలెట్టొద్దు... మీతో పెళ్ళయినప్పట్నుంచి వింటన్నానీ సొద. ఎవరన్నా డబ్బు సంపాదిద్దాం అనుకుంటారు. మన తాలూకా అంతా పేరు సంపాయించుకుందాం అనుకుంటారు. ఎవరికీ లేన్ది ఈ చదువు పిచ్చేటి మీకు అసలిది

ఎలా పట్టుకుంది మీకు?'' అని విసుక్కోడం మొదలెట్టిన పాపక్కతో ''అంత చిరాకుపడిపోతే నాది పిచ్చి కాదే ఎర్రి మొకమా... పెద్ద చదువు నేనెలాగా చదవలేకపోయేను. నలుగురికీ చెపుదామనుకోడం పిచ్చా...రాములోరి గుడి అరుగుమీద ఊళ్ళో జనం అనే మాటే నువ్వూ అంటా వేంటే?'' అనేసి మళ్ళీ చదువుకుంటే ఎంత విజ్ఞాన మొస్తదో లోకమెంత గొప్పగా అర్థమవుద్దో చెప్పడం మొదలెట్టేడు పెళ్ళానికి.

కొన్నాళ్ళు గడిచినియ్యి. సుబ్బారావుకి ఇద్దరు మగపిల్లలు పుట్టారు. పెద్దోడికి అన్నవరం సత్యన్నారాయణమూర్తి పేరు. చిన్నోడికి కులదైవం వీరభద్రుడు పేరు పెట్టాడు. పెద్దోడు సత్యనారాయణ బుద్ధిగా చదువుకోడంతో వాడ్నైనా మేష్టార్ని చేద్దామనే ఆశపడి మహాగారంగా పెంచుకుంటా ఒళ్ళో కూర్చోపెట్టుకుని పాఠాలు చెప్పడం మొదలెట్టాడు...

బుద్ధిగానే చదువు కుంటున్నాడనుకున్న సత్యనారాయణ పదోతరగతిలోనే ఆ వీధిలో కాసులమ్మ కూతుర్ని ఇష్టపడి పెళ్ళి చెయ్యమన్నాడు. తప్పక చెయ్యాల్సి వచ్చింది. మనుగుడుపుకి అత్తోరింటికెళ్ళి అక్కడే ఉండిపోయేడు. ఇదేంటంటే ఇక్కడే బాగుంది అన్నాడు.

చిన్నకొడుకునన్నా మేష్టార్ని చేసి తీరతాను అని మొంకి పట్టు పట్టిన సుబ్బారావు కసిగా చదివిస్తున్నాడు. చిన్నకొడుకు వీరభద్రుడికి ఆట పాటల్లో స్కూల్ ఫస్టులో వున్నా చదువులో మాత్రం అందరికన్నా ఆఖర్లో వున్నాడు. దాంతో ఏడోక్లాసులోనే తప్పాడు. వాడ్ని నాలుగుబాది చదువుచెపుదావంటే వీరభద్రుడు పూనతాడు వాడిమీద. ఏం జెయ్యాలమ్మా తుని దగ్గర లోవలో ఉన్న తలుపులమ్మా అనుకుని మెత్తమెత్తగానే వాడికి పాఠాలు చెప్పిస్తే నానా తంటాలూ పడి ఏడోక్లాసు పాసై ఎనిమిదిలో కొచ్చేడు.

వీరభద్రుడు చదువుగురించి తెల్సిన సుబ్బారావు ఎలాగైనా పదోక్లాసు పాసవ్వాలనుకుని వీరభద్రుడు ఫ్రెండ్సయిన పడాలసుబ్బారెడ్డి, మద్దిపూడి శీను, నల్లబ్బుకొడుకు చిట్టిగాడ్ని, తేలుకొంటి సాయిని, వరహాల్రావుని, రాయల్రెడ్డిగారి అమ్మిరెడ్డి ఇళ్ళకెళ్ళి వాళ్ళ అమ్మాబాబుల్ని ఒప్పించి వాళ్ళ మేడ మీద వీళ్ళందరి చదువుకు కావాల్సిన ఏర్పాట్లు చేసి కాపలా ఉన్నాడు.

చదువుకుంటున్న వీళ్ళందరికీ నిద్రలు రాకండా టీ కాసి ఇచ్చేవాడు... ఆకలేస్తుంటే పెళ్ళాం పాపాయక్కని లెగ్గొట్టి వేడి వేడి ఇడ్డెన్లు, గోధుంనూక ఉప్మా, చేయించి పెట్టించేవాడు. పిల్లలకోడి చుక్క కిందకి దిక్కుండానే లేచిపోయి గుడ్డిగేదె పాలు పితికి పాపాయి చేత టీ కాయించి వాళ్ళని లెగ్గొట్టి ఇచ్చేవాడు.

వీరభద్రుడు మాత్రం రెండు కాళ్ల మధ్య పుస్తకాలు పెట్టుకుని గురక పెట్టి నిద్రపోయేవాడు. అదిచూసిన సుబ్బారావు కొడుకుని పిల్చి మొకం కడిగించేవాడు. అప్పటికికూడా పడుకుంటే మార్కండేయులుగాడికి రూపాయి బీడిలు కొని వీరభద్రుడు మొకం మీద ఊదించేవాడు. మార్కండేయులుగాడు మొకం మీద పొగ ఊదుకుంటూ దాని వాసనకి అలవాటు పడిన వీరభద్రుడు సుబ్బారావు చూడకండా ఒకో బీడీ ఒకో బీడీ కాల్చడం మొదలెట్టాడు. సుబ్బారావు పైకి చదవరా వీరభద్రుడూ అంటే ఇంగ్లీషు స్టోరీస్ చదువుతున్నట్టుగా సుబ్బారావుని తమాషాగా తిట్టేవాడు.

పదోతరగతి పరీక్షలు మొదలయ్యాయి. వీరభద్రుడ్ని ఊరి ఆంజనేయస్వామి గుళ్ళో అభిషేకం చేయించి దగ్గరుండి పరీక్షలకూ తీసుకెళ్ళేడు. వీరభద్రుడు పరీక్ష రాసి వచ్చేదాకా గోడ దగ్గర నిలబడ్డాడు. రాయడం అయిపోయి బయటికొచ్చేక ''ఎలారాసేవురా'' అంటే ''చాలా బాగా రాసేను నాన్నా'' అన్నాడు.

ఆ మాట విని చాలా ఆనందపడ్డాడు సుబ్బారావు. పెళ్ళాం పాపాయక్క దగ్గరకొచ్చి ''ఏమే పాపా..మన ఆఖరోడు వీరభద్రుడు పదోతరగతి ఫస్టుక్లాసులో పాసవుతాను అంటున్నాడే''అంటూ ఆనందంగా మురిసిపోతూ మరీ చెప్పాడు.

పదోతరగతి రిజల్ట్సు వచ్చాయి. పేపరు చూస్తున్న సుబ్బారావుకి వీరభద్రుడు నెంబరు కనబడ్డం లేదు. వీరభద్రుడుతో పాటు వాళ్ళ మేడ మీద చదువుకున్న కుర్రోళ్ళంతా "మేం ఫస్టు క్లాసులో ఫాసయ్యాం..మేం ఫాసయ్యాం" అంటూ కేరింతలు కొడుతూ పెళ్ళిపోతున్నారు. వీరభద్రుడు నెంబరు కనపడక గుండెలు జారిపోయినట్టయ్యింది కటకం సుబ్బారావుకి.

స్కూలు కెళ్ళి ఎన్ని పరీక్షలు పాసయ్యాడు మావాడు అని కనుక్కుంటే ఒక తెలుగు తప్ప తక్కిన అన్ని పరీక్షలు తప్పాడు అని చెప్పాడు హెడ్‌మాస్టారు సూర్రావుగారు.

ఈ సారి ఎలాగైనా వీరభద్రుడ్ని పాస్‌చెయ్యాలనుకున్న సుబ్బారావు పదోతరగతిలోకి వచ్చిన కుర్రాళ్ళని బ్రతిమాలుకుని మళ్లీ మేడమీద వాళ్ళ చదువుకి కావాల్సిన ఏర్పాట్లు చేయించాడు.

ఈసారి వీరభద్రుడ్ని క్షణం తీరిక లేకండా చదివిస్తున్నాడు సుబ్బారావు. చాలాసేపటి దాకా కుర్రాళ్ళని చదివించి తెల్లవారు ఝామున లెగ్గొట్టడానికి కిందకెళ్ళి పడుకోడానికి సుబ్బారావు పెళ్తే, ఈ కుర్రోళ్ళంతా కల్సి లోవరాజు వెనకాలే రేకు తలుపు గొళ్ళెం తీసి రామచంద్రపురం సినిమాకి బయల్దేరారు. వాళ్ళలో బ్రేమ్మల రామం సినిమాకెళ్ళకండా ఆగిపోయేడు. రామం కాళ్ళకి పెద్ద పురుకోస తాడు కట్టి కిందకి వ్రేలాడదీసి మరీ పెళ్ళారు. సినిమా చూసొచ్చిన వీళ్ళు చడీచప్పుడు లేకండా పురుకోస తాడు లాగడం మొదలెట్టారు. తాడు లాగుతుంటే మెలుకువ వచ్చిన రామం కళ్ళు నులుపుకుంటూనే పెళ్ళి తలుపు తీసాడు.

అక్కడ్నించి ప్రతీరోజు సినిమాకెళ్ళడం... పురుకొస తాడు లాగడం..రామం తియ్యడం లాంటిఎదవపన్లు చేస్తానే వున్నారు.

పరీక్షలు దగ్గర పడ్డున్నాయి.

ఆ సంవత్సరం చదివిన కుర్రోళ్ళంతా ఫస్టుక్లాసులో పాసయ్యారు. వీరభద్రుడు పరీక్ష మళ్ళీ తప్పింది. అలాగ అయిదు సంవత్సరాలు గడిచినియ్యి. వీరభద్రుడు మాత్రం పరీక్ష తప్పుతానే వున్నాడు.

ఒక సంవత్సరమ్మైతే సుబ్బారావు పరీక్షహాలు గోడ దగ్గర దొంగలా కూర్చుని వీరభద్రుడికి స్లిప్స్ అందించాడు. తండ్రి ఏ ప్రశ్నలకు జవాబులు అందిస్తున్నాడో కూడా తెలీని వీరభద్రుడు ఆ సంవత్సరంకూడా తప్పాడు.

అప్పటికే పది సంవత్సరాలయిపోయింది. వీరభద్రుడు పదోతరగతి ఫాసవ్వలేదుగానీ పెళ్ళిచేసుకుని ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. సుబ్బారావుమాత్రం నిరాశగా చూస్తున్నాడు. ఎప్పటికైనా తన వంశంలో ఎవరైనా మేష్టారు వుద్యోగం చేస్తాడని.

వయస్సు పైబడుతున్న సుబ్బారావు తన మనవడమైనా మేష్టారు ఉద్యోగం చేస్తే చూసి ఆనందంగా కన్ను మూద్దామని ఎదురు చూస్తున్నాడు. కానీ, అది కుదిరేలాలేదు.

ఒకరకమ్మైన తన వింతకోరికని దాదాపు చంపేసుకున్న సుబ్బారావు ఎవరన్నా కుర్రోడొచ్చి చదువుకుంటానండీ అంటే పోన్లే ఈళ్ళన్నా చదూకోనీ అని ఎంతడిగినా ఇస్తున్నాడు.

ఆవేళ పొద్దుట హరినాధరెడ్డి గుర్రమెక్కి మాచవరం బయేల్దేరేడు. కుమ్మరికోటయ్యగారి దొడ్లో తిరుగుతున్న చక్రం ముందుకూర్చుని మట్టిముద్దని కుండలా తిప్పుతున్నాడు వాళ్ళ మూడోకుర్రోడు బాలు. గవర్రెడ్డిగారి దొడ్లోమెత్తని నల్లమట్టిలో పెరిగిన పచ్చటి బెండమొక్కలు ఏపుగా పెరిగినియ్యి. సుబ్బారావుగారిపాత మేడ ముందు వేలాడదీసిన వరికుచ్చులమీద పిచ్చికలూ చిలకలూ వాలి గింజల్ని ముక్కున కరుచుకెళ్తున్నాయి. నిక్కర్లూ కురసచొక్కాలూ వేసుకొచ్చిన ముగ్గురు బక్కచిక్కిన కుర్రోళ్ళు సుబ్బారావు ఇంటికొచ్చి "ఏవండీ సుబ్బారావు గారండీ" అని పిల్చేరు.

తలుపు బార్లా తెరుచుకుని బయటికొచ్చిన సుబ్బారావు ''ఎవర్రా మీరు... ఏం కావాలి?'' అన్నాడు.

'మేం కాకి అబ్బులుతోటలో ఉంటావండీ టెన్త్ పేసయ్యేవండీ కాలేజీలో చేరడానికి ఫీజు డబ్బుల్లేక మీ దగ్గరకొచ్చేవండి'' అన్నారు.

వాళ్ళ ముఖాల్లో సరస్వతి కనిపించింది సుబ్బారావుకి ''చదువులాపకండొరే'' అని లోపలికెళ్ళి బర్మాటేకు బీరువా తెరిచి లెక్క (డబ్బు) బయటికి తీసి వాళ్ళడిగినంత ఇచ్చి పంపించేడు.

ఇంకో రెండ్రోజుల తర్వాత బండ్రేవుగట్టు నించొస్తున్నారని వచ్చిన నలుగురు కుర్రోళ్ళు ''డిగ్రీలో చేరేవండి ఫీజులకీ పుస్తకాలకీ డబ్బులేక మీ దగ్గర కొచ్చేవండి'' అన్నారు.

వాళ్ళతో కాసేపు మాటాడిన సుబ్బారావు లోపలికెళ్ళి వాళ్ళకి కావాల్సిన లెక్క పట్టుకొచ్చిచ్చేడు.

ఇంకోవారం తర్వాత ఎర్రమట్టిగోతుల దగ్గర్నుంచి వస్తున్నావని చెప్పి వచ్చిన ఇద్దరు పిల్లలు కాకినాడలో చదువుల కెళ్తున్నావని చెపితే మనస్ఫూర్తిగా డబ్బిచ్చి పంపేడు సుబ్బారావు.

ఆవేళ కార్తీకపున్నమి. శీతాకాలపు గాలి చల్లగా తగుల్తుంది. దొడ్లో మందార మొక్క పక్కనున్న పచ్చగడ్డిమీద అడ్డచారల జంబుకానా పరుచుకుని దానిమీద వెల్లకిలా పడుకున్న సుబ్బారావుకి మాగన్నుగా నిదరపట్టింది.

చాలాసేపయ్యేసరికి ఎవరో తట్టి లేపేరు.

ఉలిక్కిపడిలేచి చూస్తే ఒక పక్క లక్ష్మీదేవీ ఇంకో పక్క సరస్వతీ దేవీ నిలబడి ఉన్నారు.

కళ్ళు చెదిరి పోయినియ్యి కటకం సుబ్బారావుకి.

వాళ్ళిద్దరూ అతన్ని అతను చేస్తున్న పనినీ చాలా మెచ్చుకున్నారు.

రెండుచేతులూ ఎత్తి అమ్మవార్లకి నమస్కారం పెట్టుకున్నాడు సుబ్బారావు. ''పోన్లేండమ్మా... మీరు నాకు చదువు ఇవ్వకపోయినా చదువుచెప్పాలన్న నాకోరికని తీర్చకపోయినా ఇలాగ చదువుకునే నలుగురికి సాయం చెయ్యడానికి రొక్కం ఇచ్చేవు లక్ష్మీదేవితల్లీ! అమ్మా తల్లీ సరస్వతీదేవీ నలుగురికి చదువు చెప్పించాలన్న బుద్ధి నాకిచ్చేవు తల్లీ! చాలుతల్లీ ఈ జన్మకిది చాలు తల్లీ.... ఇక రేపట్నుంచి మా ఏరియాలో చదువుకుంటాను అనొచ్చిన ప్రతీవోడికీ సాయపడతాను తల్లుల్లారా'' అంటుండగా మెలుకువ వచ్చేసింది సుబ్బారావుకి.

సుబ్బారావు చేస్తున్న దానాలు పెరిగిపోయినియ్యి.

కానీ,

పెద్దోళ్ళు వెనకాలుండి పంపిస్తుంటే వస్తున్న ఈ కుర్రోళ్ళ చదుకుంటున్నావని జెప్పి తన ముందు జేరి రామఢోలు వాయిస్తా, దోబుచ్చీలాడి డబ్బులు ఒడుక్కు పోతున్నారన్న నిజం కటకం సుబ్బారావుకి తెలిస్తే అతని పీలగుండెకాయ ఏమైపోతుందో మరి???

* * *